# జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

బుధవారం 12-08-2026

సంపుటి 1 సంచిక 260

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195




## క్యామ మల్లేష్‌కు కేటీఆర్ పరామర్శ

అస్వస్థతపై ఆరా.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష..

4




# 21% ఓట్లు గాయబ్

**తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల ఓటర్లకు.. వచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలు 2.64 కోట్లే!**

**73.39 లక్షల ఫారాల జాడలేదు**

**వీటిలో మరణించిన ఓటర్లు, డబుల్ ఓటర్లు, ఇతర కారణాలతో ఇవ్వనివారున్నారు**

**ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి**

**దశ, హైదరాబాద్, ఆగస్టు 11:** తెలంగాణ రాష్ట్రంలో నిర్వ హించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా 73,39,234 ఓట్లు తగ్గినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఎస్ఐర్ ప్రక్రియ సోమవారంతో గడువు ముగియడంతో మంగళవారం సీఈవో కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ వివరాల ప్రకా రం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఓటర్ల సంఖ్య 3,38,26,448 ఉండగా అం దులో 2,64,87,214 ఓటర్లకు సం బంధించి ఎన్యూమరేషన్ ఫారాలు మాత్రమేనని డిజిటలైజేషన్ చేసినట్లు పేర్కొన్నారు. 73,39,234 ఓట్లకు సం బంధించిన ఎన్యూమరేషన్ పత్రాలు రాలేదని అధికారులు స్పష్టంచేశారు. వీటిలో ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఓటర్లు 45,18,961, మరణించిన ఓటర్లు 9,22,230, అందుబా టులో లేని ఓటర్లు 11,25,546, మరో చోట ఓటు ఉన్న వారు (డబుల్ ఓటర్లు) 6,70,203, ఇతర కారణాలతో ఎన్యూమరేషన్ కాని వారు 1,02,294 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు.

### 17న ముసాయిదా జాబితా..

మొత్తం ఓటర్లలో 78.30 శాతం మంది వివరాలు డిజిటైజ్ కాగా

..మిగతా 4వ పేజీలో →



## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**ఈ నెల 31 వరకు స్వీకరణ**

**అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు**

**దశ, హైదరాబాద్, ఆగస్టు 11:** అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మం జూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు.

..మిగతా 4వ పేజీలో →

## ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

**వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి**

**మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలి**

**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాట్లు చేయాలి**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**



**దశ, హైదరాబాద్, ఆగస్టు 11:** హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌పై సీఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్‌లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలుపెట్టాలని తెలిపారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్‌కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రోరైల్ కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్ భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాట్లు చేయాలి.. డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి

..మిగతా 4వ పేజీలో →



## 18 నుంచి కేబీఆర్ చుట్టూ వన్ వే!

**అధికారికంగా అమలు చేయనున్న పోలీసులు**

**వెల్లడించిన సీపీ సజ్జనార్**

**వాహనదారులకు కీలక సూచనలు**

**బంజారాహిల్స్, ఆగస్టు 11:** కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ప్ర యాణించే వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ముఖ్యమైన ప్రకటన చేశారు. ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్

..మిగతా 4వ పేజీలో →

## 164కు చేరిన కొలంబియా మృతుల సంఖ్య

**కొనసాగుతున్న సహాయక చర్యలు.. కొలంబియాను వణికించిన భూకంపం**




బోగోటా, ఆగస్టు 11: కొలంబియా పశ్చిమ ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన భూకంపంలో మరణించిన వారి సంఖ్య ౧౬4కు చేరింది. మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆ దేశపు అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూకంపం వల్ల 87 మంది గాయపడగా, 2,700 మంది గల్లంతయ్యారు. సోమవారం పశ్చిమ కొలంబియా లో 7.4 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా కనీసం 77 మంది మరణించడమే కాకుండా, అనేక నగరాల్లో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ భూకంపం పెరీరా, క్విబ్డో, కాలి, మనిజాలెస్ సహా అనేక పశ్చిమ నగరాలను ధ్వంసం చేసింది. అనేక నగరాల్లోని విమానాశ్రయాలలో విమాన సర్వీసు లను నిలిపివేశారు. ఈ విపత్తు నేపథ్యంలో దేశాధ్యక్షుడు అబెర్లార్డో డి లా ఎస్ప్రియెల్లా దేశవ్యాప్తంగా నేషనల్ ఎమర్జెన్సీని ప్రకటించారు.



## నిషేధిత భూములపై ఆందోళన వద్దు

**22 ఏ పేరుతో అర్హులకు అన్యాయం చేస్తే సహించం**

**చట్టబద్ధంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం**

**యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తుల పరిష్కారం**

**ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ల నమోదు**

**ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**'22ఎ/పీఓబీ అంశం పై కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లతో చర్చ**



## కేరళం పేరు మార్పు బిల్లుకు ఆమోదం

**కో--ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లుకు కూడా..**

**రెండు బిల్లులను ఆమోదించిన లోక్‌సభ**

**వర్షాకాల సమావేశాల్లో 17వ రోజూ గందరగోళం**

**ఉభయ సభలతోపాటు 'పార్లమెంట్' వెలుపలా నిరసన**

**ఢిల్లీలో లాఠీచార్జీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానమివ్వాలని డిమాండ్**

**రాంచీ విద్యార్థులపై జార్ఖండ్ ప్రభుత్వ పోలీస్ చర్యపై ఎన్టీయే కూటమి ఎంపీలు ఫైర్**

**ఏఐసీసీ అగ్రనేత రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్**

**దశ, న్యూఢిల్లీ, ఆగస్టు 11:** పార్లమెంట్ వర్షాకా ల సమావేశాలు మంగళవారం ౧౭వ రోజూ గందరగోళం మధ్యే నడిచాయి. విపక్షాల డిమాండ్లతో ఉభయ సభల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఉదయం 11 గంటలకు రెండు సభలు ప్రారంభం కాగానే విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. గతనెల ౨౦న ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిపై కేంద్ర మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని, అయోధ్య రామ్‌మందిర్ నిధుల దుర్వినియోగంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశాయి. లోక్‌సభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ 'కేరళ ఆల్టరేషన్ ఆఫ్ నేమ్ బిలు'లను, అలాగే, సహకారశాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ 'నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టారు. విపక్షాల గందరగోళం మధ్యే స్పీకర్ ఓం బిర్లా రెండు బిల్లులపై మూజువాణి ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్‌లో ఎలాంటి చర్చ లేకుండానే రెండు బిల్లులూ సభ ఆమోదం పొందాయి. మొదటి బిల్లు ద్వారా కేరళ పేరును 'కేరళం'గా మార్చడం కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. రెండో బిల్లు

..మిగతా 4వ పేజీలో →

# 18 నుంచి కేబీఆర్ చుట్టూ వన్ వే!



**మొదటి పేజీ తరువాయి**

విధానాన్ని అధికారికంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్ లోని టీజి ఐసిసిసి భవనం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సి పి సజ్జనార్, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ఇతర అధికారులతో కలిసి కేబీఆర్ పార్క్ చుట్టు పక్కల ట్రాఫిక్ ఆంక్షలు, విధివిధానాలపై పలు సూచనలు చేశారు.

### రాకపోకలకు ఇబ్బంది కలగకుండా..

హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు,అండర్పాస్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనుల వల్ల రహదారి వైశాల్యం తగ్గడంతో నిత్యం తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ఈ ఇరుకు రోడ్లపై ఇరువైపులా వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల తీవ్ర ప్రయాణ జాప్యంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూ పిస్తూ, రద్దీని నియంత్రించేందుకు ప్రయాణికుల భద్రతను నిర్ధారించేందుకు ఈ వన్ వే విధానాన్ని నిర్ణయించారు.

### రెండు విడతల్లో ప్రయోగాత్మక పరిశీలన..

ఈ నూతన విధానాన్ని శాశ్వతంగా అమలు చేయడానికి ముందు క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసేందుకు పోలీసులు రెండు విడతల్లో పైలట్ ట్రయల్స్ నిర్వహించారు. ఏప్రిల్ 5న 3 గంటల పాటు మొదటి ట్రయల్, జూన్ 21న 6 గంటల పాటు రెండో ట్రయల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల ఫ్లో, జంక్షన్ల వద్ద రద్దీ, లేన్ క్రమశిక్షణను నిశితంగా పరిశీలించిన అధికారులు అవసరమైన సర్దుబాట్లు పూర్తి చేసి ఇప్పుడు వన్‌వే విధానాన్ని అమల్లోకి తెస్తున్నారు.

### సజావుగా ప్రయాణం కోసం విస్తృత ఏర్పాట్లు..

వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. రహదారులపై స్పష్టమైన లేన్ మార్కింగ్లు, లేన్ ఛేంజర్లు, దిశా సూచిక బోర్డులు అందుబాటులోకి తెచ్చారు. కీలకమైన జంక్షన్లలో 24 గంటలూ ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. గూగుల్ మ్యాప్స్ వంటి నావిగేషన్ యాప్లలో కొత్త వన్‌వే మార్గాలకు అనుగుణంగా మార్పులు చేస్తున్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో రియల్ టైమ్ ట్రాఫిక్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తారు.

### వాహనదారులు, సందర్శకులకు సూచనలు

కొత్త వన్‌వే మార్గాలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని అధికారులు కోరారు. రోడ్డు మార్కింగ్లు, సైన్ బోర్డులు, విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్ల వంటి అత్యవసర వాహనాల కోసం లేన్2 ద్వారా ఉచిత మార్గాన్ని కల్పించాలన్నారు. కేబీఆర్ పార్క్ వాకర్లు, సందర్శకులు తమ వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలపాలని సూచించారు. రాత్రి వేళల్లో లేదా రద్దీ తక్కువగా ఉన్న సమయంలో కూడా ఎలాంటి పరిస్థితుల్లోనూ రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేయకూడదని అధికారులు స్పష్టం చేశారు. రోడ్డు మలుపుల వద్ద, ఇరుకైన మార్గాల్లో లేదా ట్రాఫిక్కు అడ్డంకిగా వాహనాలను పార్క్ చేయకూడదన్నారు.సోషల్ మీడియాలో వచ్చే ధ్రువీకరించని ట్రాఫిక్ వదంతులను నమ్మవద్దు, ఫార్వర్డ్ చేయవద్దని తెలిపారు.అధికారిక సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సోషల్ మీడియా ఖాతాలను చూడాలన్నారు. నిర్మాణ పనులు పూర్తి అయ్యేంత వరకు నగర పౌరులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

**మొదటి పేజీ తరువాయి**

రేవంత్‌రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్‌లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారుచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత భూములపై ఆందోళన వద్దు

**హైదరాబాద్, ఆగస్టు 11:** నిషేధిత ఆస్తుల పిఓబి /22ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను ప్రభుత్వ నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో 22ఏ/ పిఓబి అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి చర్చించారు. 22ఏ సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్ బై కేసును ప్రతి రోజూ సమీక్షించాలని, 22ఏ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదని మంత్రి హెచ్చరించారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈ నెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని, రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత వస్తుందని తెలిపారు. మరింత పారదర్శకత కోసం పహానీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఏక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చినట్టు మంత్రి గుర్తు చేశారు. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికి గాని తీసుకురావాలని, పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలని మంత్రి సూచించారు. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలని, కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలన్నారు. గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి.

# గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం

## అవసరమైతే లోకాయుక్త, న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి**

హైదరాబాద్, ఆగస్టు 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి చెందిన టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీకి విలువైన ప్రభుత్వ భూమి కేటాయించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని ఆరోపించారు. ఒక్క ఉద్యోగి లేని, రూ. లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమి ఎలా కేటాయించారు? అని ప్రశ్నిం చారు. ఈ విషయంపై గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. అవసరమైతే లోకాయుక్త, న్యాయస్థానాలను ఆశ్ర యిస్తామని, వాస్తవాలు తేలే వరకు వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు జీరో అని ఊరికే అనలేదు.. పాలమూరురంగారెడ్డి జాతీయ హోదాపై ఎంపీల వైఖరేందో చెప్పాలన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని, జీఆర్ఎంబీ (గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు ) సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం బహిష్కరించాలని, లేకుంటే జల ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కొండల్‌రెడ్డి చెందిన కంపెనీ వివరాలు, దాని మూలధనం, ఉద్యో గుల సంఖ్య, కార్యాలయ చిరునామా, కంపెనీ చైర్మన్ వ్యవహారం, ప్రభుత్వ భూమి కేటాయింపు తదితర అంశాలను పరిశీలిస్తే ఇందులో భారీ కుంభకోణం జరిగిందని స్పష్టంగా అ ర్థం అవుతుందన్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర ంలో జరిగిన అతిపెద్ద భూ కేటాయింపు అక్రమాల్లో ఒకటిగా తాము అనుమానిస్తున్నా మని పేర్కొన్నారు. కొండల్‌రెడ్డి తన లింక్డ్ ఇన్ ప్రొఫైల్లో టెస్సరాక్ట్ అడ్వానస్డ్ సిస్టమ్స్, భూపాల్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్‌కు తాను బాధ్యత వహిస్తున్నట్లు పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. టెస్సరాక్ట్ సంస్థ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో పనిచేస్తున్నట్లు పేర్కొంటూ నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా కాన్సుల్ జనరల్ కూడా పాల్గొన్న విషయాన్ని ఆయ న ప్రస్తావించారు. అనంతరం యూఎస్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో టెస్సరాక్ట్ అడ్వానస్డ్ సిస్టమ్స్ చైర్మన్‌గా కొండల్ చేరినట్లు సంబంధిత సంస్థ స్వయంగా ప్రకటించిందని కేటీఆర్ తెలిపారు. టెస్సరాక్ట్ అడ్వానస్డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వివరాలను పరిశీలించినప్పుడు అనేక అనుమానాస్పద అంశాలు బయటపడుతున్నా యని కేటీఆర్ అన్నారు. కంపెనీ వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఫోన్ నంబర్ 123456789గా ఉందని, ఇలాంటి వివరా లు ఎలా ఉన్నాయో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, 2025 మార్చి 31 నాటికి కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేరని, ఉద్యోగుల సంఖ్య సున్నా అని కంపెనీ వివరాల్లోనే పేర్కొన్నట్లు తెలిపారు. కంపెనీ పెయిడ్‌అప్ క్యాపిటల్ కేవలం రూ.1 లక్ష మాత్రమేనని, పటాన్‌చెరు ప్రాంతంలో ఒక చిన్న చిరునామాను కార్యాలయంగా చూపిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఆర్థిక సామర్థ్యం ఉన్న కంపెనీకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందని, ఆ భూమి విలు వ సుమారు రూ.200 కోట్లు ఉంటుం దని కేటీఆర్ ఆరోపించారు. అయితే ఆ భూమిని సుమారు రూ.7 కోట్లకే, గజానికి సుమారు రూ.3,700 చొప్పున కేటాయించినట్లు వివరాలను వెల్లడించారు. ఒక్క ఉద్యోగి లేని, రూ.లక్ష పెయిడ్‌అప్ క్యాపిటల్ ఉన్న కంపెనీకి రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూ మిని కేటా యించడం ఎలా సాధ్యమైంది? ఇది స్కాం కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

### సంబంధంలేదని శ్రీధర్ ఎలా చెబుతారు?

టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారన్నారు. అయితే కొండల్ రెడ్డి స్వయంగా తన లింక్డ్ఇన్ ప్రొఫైల్లో టెస్సరాక్ట్ చైర్మన్‌గా పేర్కొన్నా రని, యూఎస్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ కూడా ఆయనను టెస్సరాక్ట్ చైర్మన్‌గా పేర్కొన్నప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు ఎలా సంబంధం లేదని చెబుతున్నా రని ప్రశ్నించారు. 'మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలియదా? ముఖ్యమంత్రి సో దరుడికి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా?' అని శ్రీధర్‌బాబును ఆయన నిలదీశారు.

# అన్నం పెట్టిన వాళ్లను ఎప్పుడూ మర్చిపోలేను

## పోచారం కీలక వ్యాఖ్యలు

బీర్కూరు: నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ వద్దకు వెళ్లి కండువా కప్పుకొన్నట్లు బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి (Pocharam Srinivas Reddy) తెలిపారు. ఆరు నెలల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని.. సగం నిధులు మాత్రమే ఇచ్చారన్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పోచారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల గుత్తేదారులు పనులు ఆపేశారు. నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ నిర్వహించారు. ఆ సమావేశంలో సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించా. సీఎం చెప్పినట్లుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి నిధులు మంజూరు చేయలేదు. కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది. అన్నం పెట్టిన వాళ్లను ఎప్పుడూ మర్చిపోలేను"అని పోచారం వ్యాఖ్యానించారు.

# క్యామ మల్లేష్‌కు కేటీఆర్ పరామర్శ

## అస్వస్థతపై ఆరా.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష..

**దశ, పెద్ద అంబర్‌పేట:** ఇటీవల అస్వస్థతకు గురై తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. మల్లేష్ ఆరోగ్య పరిస్థితిని కేటీఆర్ అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) తదితరులు క్యామ మల్లేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మల్లేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, అవసరమైన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజా సేవలో తిరిగి చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

# కేరళం పేరు మార్పు బిల్లుకు ఆమోదం

**మొదటి పేజీ తరువాయి**

ద్వారా దేశీయ సహకార రంగాన్ని బలోపేతం చేయడం, రైతులకు సులభమైన పద్ధతిలో రుణాలు మంజూరు, తద్వారా గ్రామీణ, వ్యవసాయాభివృద్ధి, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యం. మరోవైపు, రాజ్యసభలో సైతం సభాకార్యకలాపాలు ఏమాత్రం ముందుకు సాగలేదు. ఉదయం సభ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే విపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సభ్యులను శాంతించమని కోరినప్పటికీ నిరసనలు తగ్గలేదు. దీంతో సభలో ఎలాంటి బిల్లులు చర్చకు రాలేదు. మొత్తానికి లోక్‌సభ, రాజ్యసభ రెండూ బుధవారా నికి వాయిదా పడ్డాయి. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉన్నది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో అధికార, విపక్షాల మధ్య పంతం మరింత పెరిగింది. 13వ తేదీతో ఈ సెషన్ ముగియనున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లుల పరిస్థితి ఏంటనే చర్చ ఇప్పుడు మొదలైంది.

### ఎంపీ ప్రియాంకను అడ్డగింత

సభ సమావేశాలకు హాజరయ్యేందు కు ఉదయం పార్లమెంట్‌లోకి కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని ఎన్డీయే కూట మి ఎంపీలు అడ్డుకున్నారు. జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిపై లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎందు కు నోరు విప్పడం లేదని నిలదీశారు. ఈ విమర్శలకు ప్రియాంకగాంధీ చిరునవ్వుతోనే సమాధానమిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీయే కూ టమికి చెందిన ఎంపీలు నిరసన ప్రదర్శన చేయడా న్ని చూడటం ఇదే మొదటి సారి అని ఎద్దేవా చేస్తూ, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### 'వందేమాతర' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

జాతీయ గేయం 'జనగణమన'కు చట్టపరమైన భద్రత ఉన్న విధంగానే, వందేమా తర గీతానికి చట్టపరమైన భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు 2026 తీసుకువచ్చింది. బిల్లును గత నెల ౨౯న రాజ్యసభ ఆమోదించగా, ఇదే నెల ౩౦న లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తులు

**మొదటి పేజీ తరువాయి**

గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న అర్హత ప్రమాణాలనే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హ తను పరిశీలిస్తారు. ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అవసరమైన పత్రాలు సమ ర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. వితంతువులకు భర్త మరణ ధ్రువీకరణపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేతజౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం ఉంటుంది. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు.

# 21% ఓట్లు గాయబ్

**మొదటి పేజీ తరువాయి**

మిగిలిన 21.70 శాతం ఫారమ్‌లు.. మరణాలు, చిరునామా మార్పులు, డబుల్ ఓట్లు ఎన్యూమరేషన్ పత్రాలు సేకరించలేదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి స్పష్టంచేశారు. దీంతో ఈనెల 17వ తేదీన ఎన్నికల సంఘం విడుదల చేయబోతున్న ముసాయిదా ఓటరు జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెల కొంది. ఈ ముసాయిదా జాబితాలో ఎవరి ఓటు ఉండబోతోంది.. ఎవరి పేరు గల్లంతు కాబోతోంది అనేది సస్పెన్స్‌గా మారింది. ముసాయిదా వెలువడిన అనంతరం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్30 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటి పరిష్కారాన్ని అక్టోబర్ 15వ తేదీలోపు పూర్తిచేస్తారు. ఆ తర్వాత అక్టోబర్ 19 వరకు తుది ఓటరు జాబితాను వెల్లడించనున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా రాష్ట్ర ఓటరు జాబితాలో పెద్దఎత్తున మార్పులు సంభవించబోతున్న సంకేతాల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తం అయ్యాయి.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com